వృక్షాన్ని ఆశ్రయించుకొనివున్న పక్షులు ఎంత కాలమని బ్రతకగలవు? ఆమెకు నిస్సహాయ స్థితిలో నేను వుండికూడా లేనట్టే అయ్యాను.

ఆఖరుసారిగా అతన్ని ప్రార్థించాను. "పోనీ! నీకిష్టంలేకపోతే నా యింటికి పంపు. నాకూ భగవంతుడేదో ఇంత ఆధారం చూపేవున్నాడు. నా చెల్లెలు నాకు బరువా ఏమిటి?" అని వేడుకున్నాను. అతడు అందుకు ఒప్పుకోలేదు. పైపెచ్చు నన్ను కొట్టవచ్చాడు. నేనూ చిన్నప్పటినుంచీ వ్యాయామం చేసివున్న వాణ్ణే. తలుచుకొంటే వాడెంత? బోయవాడు పక్షిపిల్ల గొంతుక పిసికినట్లు పిసకగలను. కాని, మా చెల్లెలిముఖం చూచి వూరుకున్నాను" ఆ యువకుడు ఆగాడు.

"అవును. వాడు దుష్టుడే! కండలు తిరిగిన దండలు" అన్నాడు కవి.

"మీరతన్ని చూచారా?" యువకుడు అడిగాడు. 'ఔను' అన్నట్టుగా కవి తల ఊపాడు.

"ఆమె పోయింది. శాశ్వతంగా నిద్రపోయింది. నేటికి సరిగ్గా ఒకనెల అయింది"అన్నాడు యువకుడు బొంగురుపోయిన కంఠంతో.

"హృదయేశ్వరీ!" అని కవి చేసిన ఆక్రందన ధ్వని దిక్కులకొసల మారుమ్రోగింది.

కథానిక

# కొత్తచిగుళ్లు

"శ్రీవిరించి"

ఉయ్యాల వూగుతోంది. కుర్రవాడు యేడుస్తున్నాడు. తల్లి సముదాయించటానికి ప్రయత్నించి ప్రయత్నించి చివరకు విసుగెత్తి యేమీ తోచక దిగాలుపడి కూర్చుంది. ఇంతకూ వాడా మొండి యేడుపు యెందుకు లంకించుకున్నట్టు? ఎంతో పెద్దసమస్యయినా తీవ్రంగా కూర్చుని ఆలోచిస్తే మేధస్సుకు సమాధానం దొరకకపోదు. కాని ప్రస్తుతం ఆమెపరిస్థితి అగమ్యగోచరంగా వుంది. రోజూ అలవాటు ప్రకారమే యీనాడూ గోరువెచ్చని నీరుపోసి స్నానం చేయించింది. తుడిచి లాలించి కడుపార పాలిచ్చి ఊయలలో పడుకోబెట్టింది. అకస్మాత్తుగా వాడు ఏడుపు అందుకున్నాడు. ఊపింది, జోకొట్టింది, లాలిపాటలు పాడింది, ఎన్నో విధాల నిద్ర పొమ్మని సజావుగా చెప్పిచూచింది. కాని లాభం మాత్రంలేదు. వాడు యేడుపు యిప్పట్లో ఆపేట్టు లేడు.

తల్లి యేం చేస్తుంది? ఎత్తుకొని తిప్పినా యేడుపు తగ్గలేదు. ఎందుకు వాడికాకష్టం? ఎందువల్ల ఆ దుఃఖం?

తల్లికీ యేడుపు వచ్చింది. కాని తనుకూడా యేడిస్తే కుర్రవాడు మరీ బేజారెత్తిపోతాడని వూరుకుంది. తరుణోపాయం దొరకటంలేదు. ఏమిటి దారి?

వాడికి నిద్రరావటం లేదు గావును, అయితే ఆడుకోరాదా? తీరి కూర్చుని యీ యేడుపు దేనికి?—ఒకక్షణం కోపంవచ్చింది. కాని తన కోపకారణం యేమిటో తెలీక మళ్ళీ తగ్గింది. వేలెడులేనిపసికందు మీదనా తనకోపం? వాడికేం కష్టం కలిగి యేడుస్తున్నాడో మరి!

యేమికష్టం కలిగింది? తనకు తెలీదా? తెలుసుకుని కష్టం తొలిగించాల్సిన బాధ్యత తనది.

అరగంటసేపు నిర్విరామంగా యేడ్చి అలసట పొందాడు వాడు. ఎక్కడ హైరాణ వచ్చి పడుతుందో స్పృహతప్పిపోతాడో అని తల్లి భయం. కాని ఆలోచన పారదు. చివరకు కుర్రాడు యేడవటం చేతగాక ఆపేశాడు. తల్లికి చాలా సంతోషం కలిగింది. అయితే యెందుకు యేడ్చినట్టు, యెందుకు మానినట్టు అని అర్థం కాలేదు. పోనీలే యేడుపుమానాడం తేచాలు అని వూరుకుంది.

కుర్రవాడు నిద్రపోతున్నాడు. తండ్రి యింటికి వచ్చాడు. అడుగులు ధబీమని చప్పుడవుతున్నాయి. తల్లి యెదురువచ్చి "గట్టిగా

అడుగులు వెయ్యకండి. కుర్రాడు లేస్తాడు-యిప్పుడే యేడ్చి యేడ్చి నిద్రపోయాడు" అన్నది. "అయితే అంతచేటెందుకు యేడిపించావు?" అన్నాడు తండ్రి. "నేనేడిపించానా యేమిటి? వాడే—"

"పోనీ వాడు యేడుస్తోంటేమాత్రం చూస్తూ వూరుకున్నావన్న మాట!"

"మీ ఆక్షేపణ మరీ బాగుంది! చాలుగాని భోజనానికి లేవండి. పొద్దెక్కిపోతోంది."

ఇంట్లో ఎవరూ అడుగులు గంభీరంగా వేసేందుకు లేదు. గట్టిగా మాట్లాడుకుందుకులేదు. నవ్వటానికి లేదు...ఏంచేసినా కుర్రవాడికోసం, వాడి ఆటపాటలకోసం వాడి ఆనందోల్లాసాలకోసమే చెయ్యాలి.

కుర్రవాడంటే తండ్రి ప్రాణం యిస్తాడు. తల్లి సర్వమూ ఇస్తుంది. కుర్రడి సుఖం కోసరే యేం చెయ్యటానికీ వెనుదియ్యరు.

ఒకనాడు తల్లిదండ్రులకు పాపిష్టిరోజు-కుర్రవాడికి జ్వరం తగిలింది. ఎంచేతతగిలింది? ఎవరూ యెరగరు. మంచి డాక్టరు వచ్చి గొప్పమందులు యిచ్చాడు. యేమీ భయంలేదు. రెండురోజుల్లో నార్మలుకు వస్తుందన్నాడు. తల్లికి ఒకటే బెంగ ఎందుకు వచ్చిందో యీ అరిష్టం అని.

వారం రోజులు అదే తీరుగా జ్వరం నార్మలుకు రాదు. వొళ్లు కొలిమిలాగ మంట. తల్లిదండ్రులు అన్నం తినరు. నీళ్లు ముట్టరు. ఏమీ చెయ్యరు. కుర్రవాడి పక్కమీదే చెరొకవేపూ దిగాలుపడి చూస్తూ నిట్టూరుస్తూంటారు. పదో రోజు కుర్రవాడి ప్రాణం అనంతవిశ్వంలో కలిసిపోయింది. తల్లికి మతి చలించిపోయింది. తండ్రికి గుండె బద్దలయింది.

ఇంట్లో వూయలలేదు. లాలిపాటలు లేవు. నవ్వులాటలు లేవు. స్మశానంలాగ చీకటి సన్యాసుల్లాగ భార్యాభర్తలు.

తల్లి మరీ ఖేదించిపోయింది. ఎంతో బలవంతం మీద రెండు మెతుకులు తింటుంది. తండ్రి తొందరగానే తేరూరాడు. గుండె నిబ్బరం చేసుకొన్నాడు. తనకు బిడ్డలే కలగలేదనుకున్నాడు. దోషప్రకటనాత్మక పుటాలోచనలు జీర్ణించుకున్నాడు. తల్లిమాత్రం కొయ్య. పలకదు. చైతన్యం లేని విగ్రహం.

"ఎన్నాళ్లిట్లా విచారంతో కుమిలిపోతావు. నీకసలు పిల్లవాడే కలగలేదనుకో" అంటాడు తండ్రి.

"ఎట్లా అనుకోను? కళ్లు తెరుచుకున్నా మూసుకున్నా వాడే కనిపిస్తున్నాడు నాకు. మర్చిపోవటం యెట్లా?"

"ఎందుకు దిగులు. ధైర్యంగావుండు. జీవితంలో అనుభవించాల్సిన కష్టాల్లో యిదెన్నోవొంతు? యింతమాత్రానికే—"

ఎన్నో చెబుతాడు భర్త. ఎట్లానయినా మళ్ళీ ఆమెను యీ ప్రపంచంలో ప్రాణిగా చేద్దామని తీవ్రకృషి చేస్తాడు. ఎంతసేపూ అతని ఆశఫలించేట్టు కనిపించదు.

కొన్నాళ్ళకు ఒకనాడు మామూలు ప్రకారం యిట్లా అన్నాడు: "నువ్విట్లా విచారంతో చిక్కిపోతోంటే నేను చూస్తూ వూరుకోలేను. కాస్త ఆలోచించు. ఎందుకింత బెంగ? ఒక్క సంవత్సరం ఓపికపట్టి మామూలుగా వుండు—మళ్ళీ ఒక కొడుకు పుడతాడు? దిగులు మింగెయ్యి. నా మాట నమ్ము."

లలనాంగి కళ్ళల్లో ఆశ చిగుర్చింది. భర్తను ప్రేమతో కౌగలించింది. జీవితాలు రథచక్రాలలా దొర్లుకుపోతున్నాయి.

ఆసియా, మధ్యప్రాచ్య దేశాల సాంఘిక పరిస్థితులను సమీక్షిస్తూ ఐక్యరాజ్యసమితి సాంఘిక వ్యవహారాల శాఖవారు 180 పేజీలుగల ఒక నివేదికను ప్రచురించారు. ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలద్వారా ఆ సమాచారం సేకరించబడింది. వివిధ దేశాలలోని జనాభా ఆరోగ్యం, ఆహారం, గృహనిర్మాణం, విద్య, ఆదాయం తదితర సమస్యలనుగురించిన సమాచారం ఆ నివేదికలలో చేర్చబడింది. 'ప్రపంచ పరిస్థితులసమీక్ష' అనే శీర్షికతో ఆ నివేదిక ఆంగ్లభాషలో ప్రచురించబడింది.